# అమ్మాయి పెళ్ళి

అమ్మాయికి పెళ్ళి కావాలి. ఇక ఆపటానికి వీల్లేదు – అంటూంది ఇంటావిడ. అంటూందేమిటి? నిజమే కూడానూ....ఏదీ? అమ్మాయి కప్పుడే పధ్నాలుగు వెళ్ళి....అన్నట్టు అది ఆ వెంకట్రామయ్యగారితో అన్న ముక్క. యదార్థానికి పదహారు వెళ్ళడానికి సిద్ధంగా వుంది మరి! అంటే పెళ్ళి – ఏదీ? ఈ మాఘంలోనన్నా చెయ్యాలన్న మాటే....అపటానికి వీల్లేదన్న మాటే.

ఏం పెళ్ళిళ్ళో నబ్బా! యెంత కష్టం? మరీ పెద్దయిన పిల్లల పెళ్ళిళ్లు.... బోలెడేసి కట్నాలు పోసి చేసినా – ఇప్పుడు కట్నాలేమైనా తగ్గినయ్యా? అబ్బే– అయిదు రోజుల పెళ్ళిళ్లు చేసినా, అలకలూ పాడూ అని పెళ్ళివారు రక్తం పీల్చినా....ఓ విధంగా అప్పటి పెళ్ళిళ్ళే సుఖమనిపిస్తుందేం? అంటే మరి ఆ రోజుల్లో ఒకరి చిక్కు ఇంకోరి చిక్కుల్లోనే ఉండేవి. ఇప్పుడలా కాదాయే!

ఎవడి సమస్య వాడిది, ఎవడిమటుకు వాడు తన కూతురి పెళ్ళి విషయమై లోవ ల్లోపల పిసుక్కు చస్తాడే గాని పైకి నోరు చేసుకుని, 'నేను హైరాన పడిపోతు న్నానర్రో!' అనడాయె. ఏదో విధంగా ఆ మూడు ముళ్ళూ పడగానే తను ప్రయోజకుడై నందువల్ల పిల్ల పెళ్ళి చేసెయ్యగలిగినట్టు నటిస్తాడాయె.... ఇంకోరి మాటెందుకూ? "ఏఁ వోయ్ కాంతం! మీ రాజి పెళ్ళేమిటి, ఎప్పుడు చేస్తావ్? సంబంధం చూశావా యెక్కడన్నా?" అని అడిగితే, సంబంధాని కేమోయ్? అనుకుంటే అయిదు నిమిషాలు పట్టదూ! ఏదీ, రాజి కిప్పుడేగా వధ్నాలుగెళ్లాయ్!" అని తను అనటంలా?

'శారదా ఆక్టు' చట్టుబండలయిరి. ఎవడొచ్చి రిపోర్టివ్వొచ్చాడు గనక! అమ్మాయికి నాలుగేళ్ళ క్రితమే, ఆ పాత పద్ధతిలోనే మూడుముళ్ళూ పడేసుంటే బాగుండిపొయ్యేదే మరి, అయితే ఈ ఏడెమిదిదేళ్ళనించీ ఉంటున్నదీ బస్తీలో నాయె — ఇంతమంది సంస్కార్ల మధ్యనాయె, నాలిగేళ్ళ క్రితమే నిజంగా అమ్మాయి పెళ్ళే చేసుంటే వీళ్ళంతా కాకులు పొడిచినట్టు పొడిచుందరూ? ఇంకా పెళ్ళి ప్రయత్నంలో లేవేమని ఇలా తగుల్తున్నారుగాని!

ఏమిటి? పిల్ల పెళ్ళంటే మాటలా? ఆ వెంకట్రామయ్యగారబ్బాయి అయితే బాగానే ఉణ్ణు — అంటూం దింటావిడ. పిల్లాడికి ముప్పై ఉంటాయో, ఏమిటో చెప్పడానికేం? ఇరవైనాలు గంటారు! నల్లగా, పొట్టిగా, బొద్దుగా ఫరవాలేదు. అందాల కేమిట్లే?....ఏమయినా, ముందు పెద్ద సంబంధం .. భారీ వ్యవహారం.... మరి బండరాయి. ఇటిక రాయి కదిలినట్టు కదుల్తుందా? ఆ వెంకట్రామయ్యగారు ఓ విధాన బయటపడ్డు!

"ఏమండీ! అమ్మాయి కెక్కడన్నా మంచి సంబంధాలుంటే కొంచెం చెబుదురూ!"

"సంబంధాలే! హై హై హై హై యెక్కడివీ....?"

"ఏమండీ? వెంకట్రామయ్యగారూ! లక్ష్మణరావుగారి తమ్ముడి కమ్మాయి నిస్తారా అనడుగుతున్నారు, మీ అభిప్రాయం ఏమిటి?"

"భేష్! చేసెయ్యండి!"

"అవును కానీండీ, ఆ కుర్రాడికి మెల్లకన్నూ!—"

"పోనిస్తురూ! మెల్లకన్నంటే అదృష్టఁ వేగదూ?"

"బొత్తిగా చదువు కూడా లేదండీ. బియ్యే పూర్తి చెయ్యకుండా వొది లేశాడు."

"ఏదో నాలుగురాళ్ళు తెచ్చుకుంటున్నాడుగా?"

మరి, ఆ మాటంటే ఎవరికన్నా మండుతుందా, మండదా? అమ్మాయికి నూరు రూపాయలు తెచ్చుకుంటున్నవాడు గొప్ప సమ్మంధంఁవా? తన కొడుక్కు కొండమీది కోతిని తెస్తాడో ఏఁవిటో!"... చూస్తాం గదూ?.... నెలకో వెయ్యి రూపాయి లార్జిస్తున్నాం ...గొప్పవాళ్ళ మనేగా ఆ అహంకారం!....

"వాళ్ళ సంబంధం చేసుకోవాల నున్నప్పుడు వాళ్ళమీద ఆగ్రహించి ఏం లాభంవండీ!" అంటూందిం టావిడ.

ఆగ్రహించద వంటే ఆగ్రహించరూ మరీ? వాళ్ళ డబ్బు వాళ్ళకుండుగాక! అంత మాత్రానికే మనల్ని చులగ్గా చూస్తే మనం సహిస్తాఁవా? ఎవరి కెక్కువ?

అంటే "వారెక్కువనే గాదుటండీ మన పిల్లను వాళ్ళబ్బాయికి చేసుకుందాంవనుకుంటా?" అంటూందింటావిడ.

అదే పొరబాటు ...వారంతవారఁ వేమనఁవూ అని వారనుకునే పక్షంలో ఇచ్చిపుచ్చుగోడాలు కాని వారంతవారు వారనుకుంటే మనంతవారం మనం! వారి డబ్బు చూసుకుని వారహంకరిస్తే, మన పిల్లను చూసుకుని మనం అహంకరించావూ? చెప్పవేఁవే?

ఏఁవిటన్నా అంటే "మీ కసలు పిల్ల పెళ్ళిచేసే తెలివితేటల్లేవు లేండి పిల్లాడి తరపు వాళ్ళెక్కడన్నా ముందు నోరుచేసుకుని, 'మీ పిల్లను మాకిస్తారా!' అనడుగుతారటండీ? ఆడపిల్ల పెళ్ళి చెయ్యాలిసుండి, మీరే నోరు తెరచి, 'మీ అబ్బాయికి మా అమ్మాయిని చేసుకోండి' అనకబోతే వాళ్ళా?" అంటూందిం టావిడ.

అందుకే వళ్ళు మండేది. మనం నోరు తెరచుకుని అన్లేదని వాళ్ళు పస్తాయించకపోతే మనం సూచనగా అడుగుతున్నాం గదా_వాళ్ళ కామాత్రం జ్ఞానం ఉండరాదూ? ఈ ఆడవాళ్ళ తర్కం ఉందే, అంతా ఇలాగే ఏడుస్తుంది....

ఆ ప్రకాశంగారి అబ్బాయి కివ్వగూడదా అని అమ్మా నాన్నా రాస్తారు.... వాళ్ళ గోల వాళ్ళదే! పిల్లవాడు చిన్నవాడు, తెలివి గలవాడు, చూడ్డాని కందంగానే ఉంటాడు, ఆ ప్రకాశంగారు లౌక్యంగా ఓ రెండుసార్లు అమ్మాయినిస్తాఁవేఁవో అని హెచ్చరించి చూశాడు కూడాను.... లౌక్యంగా హెచ్చరించాడు గనుక మనకు అర్థమే కానట్టు నటించడానికి వీలయింది. నిజంగా నోరుచేసుకుని అడుగుతే ఏమనాలో తెలీదు! ఏం వుందిలే? "ఇంకా రెండేళ్ళదాకా పిల్ల పెళ్ళి చెయ్యాలని లేదండీ....చదువు" అనాలి.

అమ్మా నాన్నా అనడానికేంలే, ఆ ప్రకాశంగారికి బొత్తిగా ఏమీ లేదూ! ఆయనేదో గుమాస్తాగిరీ చేసి డెబ్భయ్యో ఎనభయ్యో తెస్తే దానికీ దానికీ చెల్లూ!

నలుగురు పిల్లలు గల సంసారం కూడా నాయెను. ఇంకా నయం ఈ కుర్రాడప్పుడే ఉద్యోగం సంపాదించి నూరో నూటపాతికో తెస్తున్నాడు. కనుక ఆ మిగిలిన పిల్లల చదువులూ అవీ సాగుతున్నై. పోనీ పెళ్ళి చేసుకుని కుర్రాడు వేరే కాపురం పెట్టుకున్నా నాలుగు డబ్బులు వెనకేసును. కాని అలా చెయ్యడు, చిన్నపిల్లలు చదువులు పూర్తి చేసేదాకా, అంటే అధమం ఇంకో పదేళ్ళు, ఆ కుటుంబ భారమంతా ఇతనిదే! అప్పటికి ఇతనికి పిల్లలు పుట్టుకొస్తారేమో! పోనీ! మనకెందుకొచ్చిన పీడ? ఏవన్నా అంటే, తండ్రి కొడుకుల కెడబాటు చేస్తున్నా డంటారు. వట్టి పాపిష్టి లోకం!

అసలే ఆలోచన తెలవక అహోరిస్తూంటే, అమ్మా నాన్నా వచ్చి అమ్మాయి పెళ్ళి నిశ్చయం చేస్తానంటారు. "ఇహ నీవల్ల కాదు గాని" అని రాస్తున్నాడు నాన్న. చేసుకున్న పెళ్ళామే అంటుంటే, అమ్మా నాన్నా అనటం అబ్బరమా? తీరా ఆ ముసలాళ్ళొచ్చి కూచుంటే వాళ్ళ ముసలి మొత్తుగోలు చూసి ఉన్న సంబంధాలు కూడా వెనక్కి చక్కా పోతయ్యో ఏమిటో సద్ది! వాళ్ళకు రావద్దన్నా రాయాలి! ఒకటా గొడవ? ప్రొద్దున్నే లేస్తే ప్రతిదీ అగ్ని పరీక్ష అయితే ఎట్టా చావడం?

ఓ చెంప వద్దు మొర్రో అని రాస్తే ఈ ముసలాళ్ళు, దారెంట నానా అగచాట్లూ పడి ఒక రైలెక్కడాని కింకొక రైలెక్కి ఇంటికి చేరడానిక్కూడా సకల యాతనా పడి, ఏ వొచ్చినట్టు? ఎందుకు రావాలి వీళ్ళిప్పుడు? అసలే జానెడు బెత్తెడు బస్తీ కొంపలు! వీళ్ళొచ్చినట్టు ఎవరికీ వాసన తెలియకముందే ఇంటికి పంపెయ్యాలి! అప్పుడే అడుగుతున్నాడు నాన్న. ప్రకాశంగారిల్లెక్కడ? ఇదేమన్నా ఇటికెంపాడా? ఇట్టా మలుపు తిరిగితే ఇల్లుండటానికి? మూడు మైళ్ళు పోవాలంటే ఆశ్చర్యపడతాడు నాన్న. పల్లెటూరి మేళం.

అమ్మ కూడా, ఆ ప్రకాశంగా రబ్బాయయితే అమ్మాయికి యీడూ జోడూగా ఉంటుందంటూంది. ఓ పెద్ద బారెట్లాగారి సంబంధం ఉందని చెబితే "అమ్మో అంతంత బరువు మనం ఎత్తలేం లేరా!" అంటూంది. ఇక్కడ కూడా ఆ పల్లెటూళ్ళలో లాగేనని! ఈ పట్టణ వాసంలో తెలివి తేటలెలా పారేదీ, ఎంత లేని రాజకీయాలున్నదీ వాళ్ళకేం తెలుస్తుంది? ఎంతో కష్టపడి దువ్వి, బుజ్జగించి, ఆ వెంకట్రామయ్యగారిని ఇర్నెల్లనుంచీ దారిలోకి తెస్తుంటే అడక్కుండా పెట్టకుండా వచ్చి ఈ ముసలాళ్ళు, ఏమీ గ్రహించకుండా, ఒక్కముక్కలో చులాగ్గా ప్రకాశంగారబ్బాయంటారు! అదేమిట్రా అంటే అమ్మాయి ఒప్పుకుందిట! అమ్మాయి దేనికన్నా ఒప్పుకుంటుంది. అమ్మాయి ప్రకాశంకొడుక్కి ఒప్పుకుందీ

అంటే తనకి పెళ్ళయితేనే చాలుననే లెక్కలో ఉందన్నమాట! ఇక ఆలస్యం చెయ్యటం భావ్యం కాదు కాని ఇంతమంది ముసలాళ్లు ఎక్కడా కాలూ చెయ్యీ ఆడకుండా చేస్తూంటే ఎలా చావడం?"

ఇంకా ఇతర సంబంధాలు పడవని ఖచ్చితంగా తేలిపోతేనే గాని ఆ ప్రకాశంగారబ్బాయిని గురించి ఆలోచించను గాక ఆలోచించనని రాయిగుద్ది చెబితే గాని, అమ్మా నాన్న ఆ ప్రకాశం గొడవ మానకపోయిరి! మానేమైందీ? మిగతా సంబంధా లేమిటని గుచ్చి గుచ్చి అడుగుతారు. అవి కాదా చెడగొట్ట టానికి. అవో పిచ్చి మొద్దు! పుటిక్కిన వెంకట్రామయ్యగారబ్బాయి మాట బయట పెట్టింది. ఆడవాళ్ళను నమ్మేందు కెక్కడా?

హయ్యో రాతా! నాన్న కాస్తా ఆ వెంకట్రామయ్యచేత ఒప్పించాడు – అమ్మాయిని వాళ్ళబ్బాయికి చేసుకోవడానికి. వీళ్ళొచ్చిం దిందుకేగా కటాబిటిగా సంబంధాలు తేల్చుకోవడం చాతకాకేనా, ఇంత శ్రద్ధగా ఆలోచిస్తున్నదీ? అడగడం వ్యవధిగా ఆ వెంకట్రామయ్యగా రొప్పుకుంటాడనిగాదూ, ఆయనతో లౌక్యం ఏడుస్తున్నది? ఆయన లక్ష రూపాయలు సంపాయిస్తే మట్టుకు అమ్మాయి లాంటి కోడలు వస్తుందా ఏమిటీ? నాన్నకీ మాత్రం తెలీదేం?" తనకే అంతా తెలిసినట్టు ఇంటావిడ, "మీ వల్ల ఇన్నాళ్ళబట్టీ కాకనేపాయె. మామగారు చూడుడి!" అంటూంది. "ఎందుకు చేశావు నాన్నా ఈ పని?" అంటే "ఇటువంటి దేదీ చెయ్యకుండా పిల్ల పెళ్ళి అవుతుందా?" అంటాడు నాన్న. పిల్ల పెళ్ళంటే ఈ రోజుల్లో మాటలా?

ఇంత ఘనకార్యం సాధించినందుకు తనకు మెచ్చుకుని మేకతోలు కప్ప లేదని ఎందుకు చేశావన్నానని నాన్నకోపం వచ్చింది. అమ్మా నాన్నా వెళ్ళిపోయినారు. అనగూడదుగాని, ముసలివారంతా ఇంతే!

ఏమయిందో అయింది. వెంకట్రామయ్యగారు వొప్పుకొనే వొప్పుకున్నాడు. మాహమాసంలో అమ్మాయి పెళ్ళి చేసెయ్యాలనుకుంటే ఆ వెంకట్రామయ్యగారు మొదట్లో "అలాగేనండి! మీ నాన్నగారు చెప్పారు ఆయనెంత యోగ్యుడండీ! ఆయన్ను రమ్మనండి అంతా స్థిరం చేద్దాం" అన్నవాడు కాస్తా నాన్న వెళ్ళిపోయినా డనేసరికి అలా సీక్కు నవిఁలాడేం? ఆఖరుకు వారం రోజులు తిప్పి మూవా డిప్పుడు చేసుకోనంటున్నాడని తొంటచెయ్యి బయట పెట్టాడేఁవిటి?

అనుమానం వొస్తే ఆడదాన్నడుగు! "ఏమండీ, మామగారి ఎక్కువేవీలేదనీ మీరడిగినా ఆ వెంకట్రామయ్యగా రొప్పుకుంటారని అంటిరే? ఇలా అయిందేం మరీ?" అన్న దింటావిడ. ఏమిటా కుంటి ప్రశ్న? అసలా వెంకట్రామయ్యలాంటి

వాళ్ళ మాటకు విలవేమిటి? అది నాలికో తాటిపట్టో గాని, ఆయనగాంగా ఔనన్న నోటితో కాదనగలిగాడు. తక్కిన వాళ్ళకు సాధ్యమా? అటువంటి నిలకడలేని మనిషిచేత అవుననిపించడమేనా, నాన్న ప్రయోజకత్వం?

అంతటితో అయిందా? "ప్రకాశమో, ప్రకాశమో" అని చంపుకుతిన్నాడు నాన్న! ఆ ప్రకాశంమటుకేం జేశాడు? మాట ఖాళీ జేశాడు. "మీ పిల్లకింకా పద్దాలుగేళ్ళని గదూ అన్నారూ? తొందరేం లెండి, రెండేళ్ళాగండి, అలాగే చూద్దాం" అన్నాడు! ఇంతలావు సంబంధం కోసమని రెండేళ్లాగాలి! నాన్న ఆలోచనల్నీ ఇంతేగా! ఏమిటో చెప్పొస్తుందింటావిడ.

ఏమయినాసరే, మాఘమాసంలో పెళ్ళిచేసి తీరాలి. అలాగంటే మరి లక్ష్మ్రావు తమ్ముడు తప్పదు. మంచిరోజు చూసి తాంబూలా లిచ్చేసుకోవాలి.

"ఇంత కల సంబంధమూ కాదు, అందమైన సంబంధమూ కాదు. ఇదేమిటండీ!" అంటూం దింటావిడ. ఈ ఆడాళ్ళ ననకు అంతుందా అని.

[ముద్రణ : 1955, కుటుంబరావు కథలు నుండి
దేశి కవితా మండలి : విజయవాడ]